అనుబంధాల కలయిక

రక్షా బంధనం.. అనురాగ నందనం

ఆత్మీయతకు ప్రతీక



కేటీఆర్‌కు రాఖీ కడుతున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి



మేడిబావి బస్తీలో తన ఇద్దరు సోదరులకు రాఖీ కడుతున్న సోదరి



రాఖీ కట్టి సోదరుడికి హెల్మెట్‌ను బహుమానంగా అందజేస్తున్న సోదరి

అనుబంధాల కలయిక.. ఆత్మీయతకు ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం ముషీరాబాద్/అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. ఆడబిడ్డల రాకతో ప్రతి ఇల్లు సందడిగా మారింది. సుదూర ప్రాంతాల నుంచి అక్కాచెల్లెళ్లు వచ్చి తమ అన్నదమ్ముళ్లకు రాఖీలు కట్టి ప్రేమానురాగాలను చాటుకున్నారు. ఆడబిడ్డల రాకతో ఇళ్లు సందడిగా మారాయి. ఈ సందర్భంగా మిఠాయి దుకాణాలు, ప్రధాన కూడళ్లల్లో మార్కెట్లు కిటకిటలాడాయి. ఎటు చూసినా రాఖీ పండుగ శోభ కనిపించింది. ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలకు ఆయా పార్టీల మహిళా నాయకులు రాఖీలు కట్టి ఆశీర్వదించారు. బ్రహ్మకుమారీస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు రాఖీ కట్టి పండుగ విశిష్టతను చాటి చెప్పారు.

- ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం



మైనార్టీ మోర్చా నేత ఎండీ మహమూదుకు రాఖీ కడుతున్న కార్పొరేటర్ ఎ.పావని





రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరి



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రాఖీ కడుతున్న మేరీ తదితరులు





హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయకు హారతి ఇచ్చి రాఖీలు కడుతున్న మహిళలు



తన సోదరులకు రాఖీలు కడుతున్న కార్పొరేటర్ జి. రచనశ్రీ



బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగేష్‌ముదిరాజ్ నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకల సందడి



బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రాజేందర్‌కు రాఖీ కడుతున్న అక్కాచెల్లెళ్లు



ఇందిరా పార్కులో జరిగిన రాఖీ పౌర్ణమి వేడుకల్లో డాక్టర్ హిప్నో పద్మకమలాకర్ ప్రముఖ యోగా గురువు సరోజినీ రామారావు

బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్‌కుమార్

కాచిగూడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. లేని పక్షంలో వేలాది మంది బీసీలతో తెలంగాణ వ్యాప్తంగా ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ప్రతి కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారని ఇప్పుడు మరో 40 కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం నేతలు వంశీకృష్ణ, నిఖిల్, సదానంద్, రాజేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక శిక్షణ సమితి అధ్యక్షుడిగా సుదీంద్ర కులకర్ణి ఎన్నిక

కాచిగూడ: కర్ణాటక శిక్షణ సమితి (నృపతుంగ విద్యా సంస్థలు) అధ్యక్షుడిగా రిటైర్డ్ జడ్జి సుదీంద్ర కులకర్ణి ఎన్నికయ్యారు. కాచిగూడలోని నృపతుంగ పాఠశాల ప్రాంగణంలో ఈ ఎన్నికలు జరిగాయి. సుదీంద్ర కులకర్ణి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సంజయ్ మన్‌సబ్‌దార్ ప్రకటించారు. ఆయన మూడేళ్ల పాటు అధ్యక్షుడిగా కొనసాగుతారు. గవర్నింగ్ బాడీ సభ్యులుగా శ్రీకాంత్‌రావు, గోవింద్‌రావు టి.ముకుంద్ కులకర్ణి, గురురాజ్ కులకర్ణి, రాఘవేంద్ర దేసి, సుదేంద్ర కులకర్ణి, రాజీవ్ దేశ్‌పాండే, చేతన్ మద్వేకర్, నరసింహమూర్తి, జోయిస్, పద్మజ కులకర్ణిలు ఎన్నికయ్యారు.

భారత్ బంద్‌ను జయప్రదం చేయండి



జంగా శ్రీనివాస్

కవాడిగూడ: ఎస్సీ వర్గీకరణ తీర్పునకు వ్యతిరేకంగా ఈనెల 21న నిర్వహించే భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో-కన్వీనర్ జంగా శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కవాడిగూడలో విలేకరులతో మాట్లాడుతూ.. దేశ అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ, ఎస్టీ ఉపకులాలను వర్గీకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. మాల సామాజిక వర్గ ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఫిర్యాదుకు స్పందించి.. ఫాగింగ్ చేసి.!



గంగపుత్ర కాలనీలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ గంగపుత్ర కాలనీలో దోమలు అధికంగా ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని బీఆర్ఎస్ నాయకులు పూసగోరఖ్‌నాథ్, జీహెచ్ఎంసీ అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. జీహెచ్ఎంసీ సిబ్బంది గంగపుత్ర కాలనీలో ఫాగింగ్ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

21న స్కూల్‌లో జాబ్‌మేళా

శ్రీనగర్‌కాలనీ: రంగారెడ్డి జిల్లా నేషనల్ కెరీర్ సర్వీసెస్, డాన్ బాస్కో దిశ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎన్‌సీఎస్ అధికారి విజయ్‌కుమార్ సోమవారం తెలియజేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా కొనసాగుతుందన్నారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులను నేరుగా ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దిశ డైరెక్టర్ ఫాదర్ జస్టిన్, కోఆర్డినేటర్లు ఐవనోవాజ్, టి.కార్తీక్‌లు పాల్గొన్నారు. జాబ్ మేళాకు సంబంధించిన పూర్తి వివరాలను 94940 92219 నెంబర్‌లో సంప్రదించగలరని తెలిపారు.

21న భారత్‌బంద్

లిబర్టీ: రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ ఈ నెల 21వ తేదీన భారత్‌బంద్ నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ తెలిపారు. సోమవారం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన బంద్‌లో భాగంగా ప్రదర్శనలు, ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించుకోవచ్చని సుప్రీంకోర్టు రాష్ట్రాలకు అధికారాలను ఆదేశాలను ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయడం చెల్లదని ఆయన స్పష్టం చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సికింద్రాబాద్ : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. లాలాగూడ - మౌలాలి రైల్వేస్టేషన్ల మార్గం మధ్యలోని రైలు పట్టాల పక్కన సోమవారం ఉదయం 6 గంటల సమయంలో సుమారు 30-35 ఏళ్లున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కాగా మృతుడు నలుపు, ఎరుపు రంగుల చెక్స్ పూర్తిచేతుల చొక్కా, నలుపు రంగు ట్రాక్ ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు.

గ్లోబల్ ఏఐ ఇన్నోవేషన్ కాంక్లేవ్ లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: అత్యంత ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్‌లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్నోవేషన్ సమిట్ లోగోను జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు జరుగుతున్నాయని అన్నారు. రాబోయే రోజుల్లో కృత్రిమ మేధస్సు విషయంలో పెనుమార్పులు రాబోతున్నాయని అన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీకి హబ్‌గా హైదరాబాద్ నగరం మారాలని ఆకాంక్షించారు. ఏఐ సిటీ కోసం 200 ఎకరాల స్థలం కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో సెప్టెంబర్ 5, 6వ తేదీల్లో జరుగనున్న గ్లోబల్ సమిట్‌కు ప్రపంచ దేశాల నుంచి ప్రముఖులు రానున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జినోసిస్ ఎండీ డాక్టర్ వినయ్‌కుమార్, చైర్మన్ నాగరాజు ఆదిరెడ్డి, శ్రీనివాస్ గుప్తా, రవి, రమణ, డాక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఇంజినీర్ల సమస్యలపై ఎంపీ కావ్యకు వినతి



వినతిపత్రం ఇస్తున్న దక్షిణ మధ్య రైల్వే ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అడ్డగుట్ట : సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని దక్షిణ మధ్య రైల్వే ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా రైల్వే ఇంజినీర్ల సమస్యలను వారికి వివరించారు. ఇంజినీర్ల గ్రూప్ 'బి' గెజిటెడ్ సాధనతో పాటు రైల్వేలో సెక్షన్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించిన వారు అదే కేడర్‌లో ఉద్యోగ విరమణ తదితర అంశాలపై విన్నవించామన్నారు. ఈ విషయాన్ని రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చినట్లు సమాచారం. అసోసియేషన్ ప్రతినిధులు పద్మనాభం, లోకేశ్వర్, శ్రీనివాసులు, ఐలయ్య తదితరులున్నారు.

మమతాబెనర్జీ దిష్టిబొమ్మ దహనం

సనత్‌నగర్: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనకు సంబంధించి సాక్ష్యాలను ధ్వంసం చేసే కుట్రలను నిరసిస్తూ సోమవారం బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ స్వామి టాకీస్ వద్ద నుంచి మమతాబెనర్జీ దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. ఈ సందర్భంగా మమతాబెనర్జీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ నిందితులకు శిక్ష పడకుండా ఆధారాలను లేకుండా చేసే కుట్రను చేస్తున్నారని ఆరోపించారు. నిందితులను కఠినంగా శిక్షించే వరకు పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ మోహన్, వెంకట సుబ్బారావు, మల్లారెడ్డి, అమ్ము రాంప్రసాద్, ఆనంద్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నివాళి



నర్సింగ్‌రావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మహిళా నాయకురాలు

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో డివిజన్ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ నేత నర్సింగ్‌రావుగౌడ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి వరలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుషాల్‌గౌడ్, లక్ష్మి, రాధిక, రాధా, వినూత్న, సత్యప్రియా తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహంతోనే క్రీడాకారులు రాణిస్తారు

- తలసాని సాయికిరణ్‌యాదవ్



వైష్ణవి మహేష్‌కు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న సాయికిరణ్‌యాదవ్..

సనత్‌నగర్: క్రీడాకారులకు చేయూతను అందించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలుగుతారని యువనేత తలసాని సాయికిరణ్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద మహిళా లిఫ్టర్ వైష్ణవి మహేష్‌కు తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అక్టోబర్ 4 నుంచి 13వ తేదీ వరకు దక్షిణాఫ్రికాలో జరిగే కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు వైష్ణవిమహేష్ ఎంపికైంది. ఈ పోటీలకు హాజరయ్యేందుకు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న విషయాన్ని తెలుసుకున్న సాయికిరణ్‌యాదవ్ ఈ మేరకు తలసాని ట్రస్ట్ ద్వారా రూ.2 లక్షల ఆర్థిక, సహాయం అందజేశారు.

ఈ సందర్భంగా తలసాని సాయికిరణ్ యాదవ్ మాట్లాడుతూ అనేక మంది నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఉన్నప్పటికీ, వారికి సరైన ప్రోత్సాహం లభించకపోవడం వల్ల రాణించలేకపోతున్నారన్నారు. వైష్ణవి మహేష్‌కు గత 4, 5 సంవత్సరాల నుంచి పవర్ లిఫ్టర్‌గా జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ చాటేవిధంగా ప్రోత్సహిస్తూ వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఎప్పటికైనా అంతర్జాతీయ వేదికపై వైష్ణవి మహేష్‌కు తన సత్తా చాటే అవకాశం లభిస్తుందనే పూర్తి నమ్మకం తనకు ఉందన్నారు. రక్షాబంధన్‌ను పురస్కరించుకుని వైష్ణవి సాయికిరణ్‌యాదవ్‌కు రాఖీ కట్టారు.

పవర్ లిఫ్టింగ్‌లో తాను అంతర్జాతీయ స్థాయిలో రాణించేవిధంగా తలసాని ట్రస్ట్, తలసాని సాయికిరణ్‌యాదవ్ అందించిన సాయం, ప్రోత్సాహాన్ని ఎన్నటికీ మరువలేనని పవర్ లిఫ్టర్ వైష్ణవి మహేష్ అన్నారు. కామన్వెల్త్ పోటీల్లో మెడల్‌ను సాధిస్తానని ఆమె ధీమా వ్యక్తం చేసింది.

కోల్‌కతా ఘటనపై కొవ్వొత్తుల ర్యాలీ

సికింద్రాబాద్ : కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన దారుణ ఘటనకు నిరసనగా సీతాఫల్ మండిలోని యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీలో స్థానిక కార్పొరేటర్ సామల హేమ పాల్గొని మాట్లాడారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు వచ్చినా అత్యాచారాలు ఆగడం లేదన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. అనంతరం కొంత మంది సోదరులు ఆడబిడ్డలకు అండగా ఉండాలని కోరుతూ.. రాఖీ కట్టారు. డాక్టర్లు ప్రత్యూష, లాస్య, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జంధ్యాల పౌర్ణమి

అంబర్‌పేట: గోల్నాక వీరన్నలగుట్ట శివాలయం ప్రాంగణంలో సోమవారం జంధ్యాల పౌర్ణమిని పద్మశాలి సంఘం ప్రతినిధులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.పద్మశాలి సంఘం ప్రతినిధులు మార్కండేయా పూజాలు నిర్వహించి జంధ్యాలను మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం నాయకులు ఏనుగంటి నరేందర్,వరకాల కృష్ణ, చిలుక శివకుమార్, ఆశోక్, సత్యనారాయణ, సత్తయ్య, దామోదార్, శ్రీనివాస్, రమేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



వీరన్న గుట్టలో జంధ్యాల పౌర్ణమి వేడుకల్లో పద్మశాలి సంఘం ప్రతినిధులు

గాయత్రీ హోమం



ముషీరాబాద్: రాఖీ పండుగను పురస్కరించుకొని ముషీరాబాద్‌లోని గౌరీశంకర్ ఆలయ ప్రాంగణంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు సంగిశెట్టి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో గాయత్రి హోమం, గాయత్రీ ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలీలు పెద్ద ఎత్తున హాజరై సామూహిక పూజలు చేశారు. సంగిశెటి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం రాఖీ పండుగ రోజు గాయత్రి హోమం నిర్వహిస్తూ పద్మశాలీలలో ఐక్యతను పెంపొందదిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి చక్రవర్తి, కోశాధికారి నాగమూర్తి, ఉపాధ్యక్షుడు రమేష్, కార్యనిర్వాహక కార్యదర్శి బడుగు శ్రీనివాస్, సత్యనారాయణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శయన దృశ్య నాటకం.. ప్రేక్షక రంజకం

చిక్కడపల్లి: భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సోమవారం సాయంత్రం త్యాగరాయ గానసభ శయన దృశ్య నాటక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కృష్ణుడిగా పున్నారావు, దుర్యోధనుడిగా సంజీవరావు, అర్జునుడిగా నారాయణస్వామి నాటికను రక్తి కట్టించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. సంగీత, నృత్య, నాటక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఉచితంగా వేదికను ఇస్తున్నామని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాకారులు శారద కళానికేతన్, త్యాగరాయగాన సభల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణుడు, దుర్యోధనుడు, అర్జునుడి వేషధారణలో ఉన్న కళాకారులతో కళా జనార్దనమూర్తి